క్లుప్తంగా

బాధితునికి సెల్‌ఫోన్ అందజేత



బాధితునికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ త్యాగరాజు

దొనకొండ: పోలీస్ శాఖ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పోయిన సెల్‌ఫోన్ కనుగొని బాధితునికి అప్పగించింది. ఎస్ఐ టి.త్యాగరాజు కథనం ప్రకారం.. మండలంలోని ఆరవల్లిపాడు గ్రామానికి చెందిన గుమ్మా బాలకాశయ్య కొన్ని రోజుల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ తాగ్యరాజు ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పోయిన సెల్‌ఫోన్ కనుగొని బాధితునికి శుక్రవారం అందజేశారు. బాధితుడు పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు తాళ్లూరు సర్వసభ్య సమావేశం

తాళ్లూరు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దారా హనుమంతురావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అర్ధవీడు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికిగాను 6, 7, 8, 9వ తరగతిలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 23వ తేదీ లోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బండి బలరామిరెడ్డి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు దర్శి గురుకులంలో ఈ నెల 25వ తేదీ ఉదయం 10 నుంచి 11 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష రాసి పాఠశాలలో ఇంకా చేరని విద్యార్థులకు ఈ నెల 23న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9000660581ను సంప్రదించాలని సూచించారు.

నేడు సీఐటీయూ మండల మహాసభ

బేస్తవారిపేట: స్థానిక కందుల ఓబుల్‌రెడ్డి డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం ఉదయం 10 గంటలకు సీఐటీయూ మండల మహాసభ నిర్వహిస్తునట్లు సంఘ కంభం మండల కార్యదర్శి షేక్ అన్వర్‌బాషా తెలిపారు. మండల నూతన కార్యవర్గ ఎన్నికలు జిల్లా కార్యదర్శి కె.సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహాసభలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఓ ప్రకటనలో కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఐదుగురికి జరిమానా

బేస్తవారిపేట: మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురిని అరెస్ట్ చేసి శుక్రవారం గిద్దలూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టులో హాజరుపరచగా శిక్ష విధించారని ఎస్సై రవీంద్రారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురు నిందితులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా, ఒకిరికి ఐదు రోజులు, ఇద్దరికి మూడు రోజులు, ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి కె.భరత్ చంద్ర తీర్పు వెల్లడించారని ఎస్సై వివరించారు.

కొమరోలు మండలంలో..

కొమరోలు: మండలంలో మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరు వ్యక్తులకు కోర్టు జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లుగా ఎస్సై నాగరాజు తెలిపారు. ఇద్దరు నిందితులను శుక్రవారం గిద్దలూరు కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానాతోపాటు 5 రోజులపాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి కె.భరత్‌చంద్ర తీర్పు చెప్పారని పేర్కొన్నారు. జరిమానా చెల్లించకుంటే మరో 15 రోజులు అదనంగా జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నట్లు తెలిపారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలి

● ఎంపీపీ ఉష

దొనకొండ: అధికారులు గ్రామాల్లో పర్యటించి ఏ గ్రామంలో మంచినీటి సమస్య ఉందో గుర్తించి పరిష్కరించాలని ఎంపీపీ బొరిగొర్ల ఉష సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ చాలా గ్రామాల్లో మంచినీటి సమస్య తమ దృష్టికి వచ్చిందని, సంబంధిత అధికారులు గ్రామాలకు వెళ్లి ప్రజలతో మాట్లాడి పరిష్కరించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. రుద్రసముద్రం ఎంపీటీసీ ఈరెళ్ల చిన్న అల్లూరమ్మ మాట్లాడుతూ తమ గ్రామానికి పూర్తిగా తాగునీటి ఇబ్బంది ఉందని, సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసినా ఫలితం లేదని మండిపడ్డారు. వైస్ ఎంపీపీ వడ్లమూడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ గ్రామం మల్లంపేటకు, ఎస్సీ కాలనీలకు నీటి సమస్య ఎక్కువ ఉందని చెప్పారు. గంగదేవిపల్లి ఎంపీటీసీ ఇరిగినబోయిన లక్ష్మమ్మ పెద్దగుడిపాడు గ్రామానికి సాగర్ జలాలు లేక తాగునీటికి ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, ఎన్నోసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఎంపీడీఓ వి.వసంతరావునాయక్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు పంచాయతీ అభివృద్ధికి దోహద పడాలని, గ్రామంలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని, మరీ ముఖ్యంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. సంగాపురం గ్రామంలో పని చేసే ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించారని, నేటికీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించలేదని, ఎస్సీ కాలనీకి సీనియర్ మేట్‌ను ఏర్పాటు చేశారని, సంగాపురం, వీరేపల్లికి సమాచారం అందటం లేదని సంబంధిత ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు ఈ రెండు గ్రామాలకు సీనియర్ మేట్‌ను ఏర్పాటు చేయాలని సర్పంచ్ భీమిని వెంకటేశ్వర్లు కోరారు. స్పందించిన ఎంపీడీఓ త్వరలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మురికిపూడి సుధాకర్, ఎంఈఓ ఎస్.సాంబశివరావు, వైద్యాధికారి చంద్రమౌళి, డిప్యూటీ ఎంపీడీఓ బి.శ్రీనివాసులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ఉష



ఎల్లమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

ఎల్లమ్మ కొలుపులు ప్రారంభం



ప్రజలను ఆకర్షించిన బొల్లావుల నృత్యం

కురిచేడు: కురిచేడులో నుసుం ఇంటిపేరు ఉన్న వారు తమ ఇలవేల్పు ఎల్లమ్మ తల్లికి కొలుపులు శుక్రవారం నుంచి ప్రారంభించారు. 30 సంవత్సరాల తర్వాత కొలుపులు ప్రారంభించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి గుండ్లకమ్మ నది వద్దకు వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అక్కడి నుంచి గ్రామోత్సవంగా గ్రామంలోకి వచ్చారు. బొల్లావుల నృత్య ప్రదర్శన చూపరులను ఆకర్షించింది. కురిచేడులో కొలుపులు చాలాకాలం తర్వాత జరుగుతుండటంతో ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

దేవరాజుగట్టులో పడకేసిన పారిశుధ్యం



కంభం వైపు వెళ్లే రహదారి పక్కన పేరుకున్న చెత్త

పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టు ఫ్లయి ఓవర్ బిడ్జి పక్కన పారిశుధ్యం పడకేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఊదరగొట్టే స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో తూతూ మంత్రంగా బ్యానర్లు చేతబట్టి ర్యాలీలు చేయడం మినహా పారిశుధ్యం మెరుగుకు అధికారులు చర్యలు తీసుకున్న దాఖాలాలు కనిపించడం లేదు. గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం అలంకార ప్రాయంగా కనిస్తున్నాయి. పారిశుధ్య కార్మికులు ఉన్నా రోడ్ల వెంట ఉన్న చెత్త కుప్పలను సకాలంలో తొలగించలేకపోతున్నారు. కంభం వెళ్లే రహదారి పక్కన రోజుల తరబడి చెత్త తొలగించక పోవడంతో కుప్పలుగా పెరుకుపోతోంది. రహదారిలో పేరుకుపోయిన చెత్త స్వాగతం పలుతోంది. రోజుల తరబడి చెత్తను తొలగించక పోవడంతో వర్షాలకు కుళ్లి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో దుర్వాసన వెదజల్లుతున్న చెత్త కుప్ప రోగాల బారిన పడతామేమోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ రహదారి వెపు ముక్కుమూసుకొని వెళ్తున్నామని వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చెత్త కుప్పను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రెవెన్యూ వ్యవస్థపై అవగాహన అవసరం



మార్కాపురం ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్ త్రివినాగ్, రెవెన్యూ ఉద్యోగులు

మార్కాపురం: రెవెన్యూ వ్యవస్థపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ పేర్కొన్నారు. శుక్రవారం రెవెన్యూ డే సందర్భంగా మార్కాపురం పట్టణంలో సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. రెవెన్యూ సేవ అంటే రైతులకు సేవ అనే ప్లకార్డులు ప్రదర్శించారు. స్థానిక గడియార స్తంభం సెంటరులో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్లు చిరంజీవి, కిరణ్, భాగ్యలక్ష్మి, డీటీ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



బేస్తవారిపేట ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్, ఉద్యోగులు

బేస్తవారిపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు రెవెన్యూ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ప్రజలకు, రైతులకు అందించే సేవల గురించి తహసీల్దార్ జితేంద్రకుమార్ వివరించారు. రిటైర్డ్ తహసీల్దార్ సయ్యద్ ఇస్మాయిల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయర్లు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

సింగిల్ ఎల్‌పీఎం సబ్ డివిజన్‌కు దరఖాస్తు చేసుకోవాలి



శ్రావణ్‌కుమార్, తహసీల్దార్

దొనకొండ: రీ సర్వే అయిన రెవెన్యూ గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంతో తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ల్యాండ్ ఎక్కువ చూపిస్తోంది. జాయింట్ ఎల్‌పీఎం ఉన్న రైతులు ఈ నెల 30వ తేదీలోపు సింగిల్ ఎల్‌పీఎంగా సబ్ డివిజన్ చేయించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

పుల్లలచెరువు: ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో రీ సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. రీ సర్వేలో పొందుపరిచిన జాయింట్ ఎల్‌పీఎంల స్థానంలో వారి భూ హక్కును ధ్రువీకరిస్తూ సింగిల్ ఎల్‌పీఎం నంబర్ కేటాయించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినందున ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ చేపట్టినట్లు తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎల్‌పీఎంల విషయంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సిబ్బందికి పలు సూచనలు చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి గ్రామ సచివాలయంలో రూ.50 రుసుం చెల్లించి జాయింట్ ఎల్‌పీఎం పట్టాదారుల భూములను ఉచితంగా సబ్ డివిజన్ చేస్తామని, ఈ అవకాశం ఈ నెల 30వ తేదీలోపు ఉందని, దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

హామీలు విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం

ముండ్లమూరు (కురిచేడు): రాష్ట్రంలో కూటమి నాయకులు ఎన్నికల ముందు నెలకు రూ.25 వేల ఆదాయం లోపు ఉండే వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రకటించి ప్రభుత్వం ఏర్పడ్డాక అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం ముండ్లమూరు మండల కార్యదర్శి వెల్లంపల్లి అంజనేయులు మండిపడ్డారు. నిరుద్యోగులుగా ఉన్న యువతీ, యువకులకు బ్యాంకుతో సంబంధం లేని రుణాలు ఇచ్చి స్కిల్‌తో కూడిన శిక్షణ ఇచ్చి అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓలో పారిశుధ్య కార్మికులకు సంక్షేమ పథకాలు ఇస్తామని చెప్పినా ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. అతి తక్కువ ఆదాయాలు వస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, స్కీమ్ వర్కర్లకు, మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులు అనే పేరుతో వారికి సంక్షేమ పథకాలు అమలు చేయటం లేదని పేర్కొన్నారు. కేవలం సీఎఫ్ఎంఎస్ వేతనాలు తీసుకున్నంత మాత్రాన వారు ప్రభుత్వ ఉద్యోగులు కాదని, వీరిలో ఎక్కువ మంది దళిత గిరిజన బలహీన వర్గాలకు చెందిన వారు ఉన్నారన్నారు. అనేక మంది రూ.10 వేల కన్నా తక్కువ వేతనం వచ్చే వారేనని ఆయన గుర్తు చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.25 వేల ఆదాయం వస్తున్నా, అంగన్‌వాడీలకు రూ.11,500, హెల్పర్లకు రూ.7 వేలు, ఆశాలకు రూ.10 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. తల్లికి వందనం నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి



విద్యుత్ సమస్యపై ఏఈని ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ మౌలాలీ

కొమరోలు: మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ కామూరి అమూల్య సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ షేక్ మౌలాలి విద్యుత్ సమస్యలపై ప్రశ్నించారు. కొమరోలులో లోవోల్టేజ్ సమస్య వలన వినియగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యను పరిష్కరించాలని ఏఈ శ్రీనివాసులును కోరారు. పలువురు సభ్యులు గ్రామాల్లో సమస్యలను లేవనెత్తారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. సమస్యలపై ఆయా శాఖల అధికారులు దృష్టి సారించి వేగంగా పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు బస్సు నడపాలి

పుల్లలచెరువు: పుల్లలచెరువు నుంచి హైదరాబాద్‌కు మార్కాపురం డిపో నుంచి బస్సు సర్వీసును నడపాలని ప్రయాణికుడు డిమాండ్ చేస్తున్నారు. మార్కాపురం డిపో నుంచి రోజూ రాత్రి 8 బస్సులు హైదరబాద్‌కు నడుపుతున్నారు. అన్నీ బస్సు సర్వీసులు పుల్లలచెరువు మండలంలోని మల్లాపాలెం నుంచి హైదరాబాద్ వెళ్లాలి. పుల్లలచెరువు మండలంలోని పలు గ్రామాల ప్రజలు నిత్యం హైదరాబాద్ వెళ్లి వస్తుంటారు. పలు గ్రామాల్లో విద్యార్థులు అక్కడ ఉద్యోగాలు చేసేవారు ఉన్నారు. మరి కొందరు ఇక్కడి నుంచి అక్కడికి వెళ్లి స్థిరపడిన వారు ఉన్నారు. ఆయా గ్రామాల నుంచి నిత్యం ప్రజలు, విద్యార్థులు హైదరాబాద్ వెళ్లి వస్తుంటారు. అక్కడికి వెళ్లాలన్నా అక్కడి నుంచి రావాలన్నా నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అదే వృద్ధులు అయితే హైదరాబాద్‌లో ఉన్న తమ పిల్లల దగ్గరకు వెళ్లడం మానుకున్నారు. మండలంలోని వెంకటరెడ్డిపల్లి, రాచకొండ గ్రామాల్లో నిమ్మ తోటలు విరివిగా ఉన్నాయి. రైతులు కాయలను వై.పాలెం తరలించి అక్కడి నుంచి మార్కెట్‌కు పంపుతున్నారు. మల్లాపాలెంలో కూరగాయలు తోటలు బాగా ఉన్నాయి. అక్కడి రైతులు కూడా మార్కెట్‌కు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. అదే పుల్లలచెరువు నుంచి హైదరాబాద్ సర్వీసును నడిపితే ప్రయాణికులకు, వ్యాపారులకు అన్ని రకాలుగా ఇబ్బందులు లేకుండా ఉంటాయని పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. మార్కాపురం డిపో అధికారులు ప్రత్యేకంగా బస్సును వేయాల్సిన అవసరం లేదు. అన్ని బస్సులు మండలంలోని మల్లాపాలెం నుంచి వెళ్లాలి. అదే ఒక బస్సు మండలంలోని నాయుడుపాలెం మీదగా వచ్చి పుల్లలచెరువు నుంచి మల్లాపాలెం వద్ద హైవేకి చేరుకుని హైదరబాద్ బయల్దేరుతుంది. ఈ విషయం అధికారులు గమనించి పుల్లలచెరువు మండల ప్రజల చిరకాల కొరికను తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యర్రగొండపాలెం: మండలంలోని మిల్లంపల్లి, కొలుకుల, యర్రగొండపాలేల్లో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ లైన్‌లకు అడ్డంగా ఉన్న చెట్ల తొలగింపు, ఫీడర్ల మరమ్మతులు శనివారం చేపడుతున్నామని ఆ శాఖ ఏఈ టి.అల్లూరయ్య తెలిపారు. ఈ కారణాలతో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ప్రైవేట్ స్కూళ్ల బస్సులు నిబంధనలు పాటించాలి



కంభం: ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు నిబంధనలు పాటిస్తూ బస్సులు నడపాలని సీఐ కె.మల్లికార్జున, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు సూచించారు. కంభం పట్టణంలో ప్రైవేట్ స్కూల్ బస్సుల డ్రైవర్లు, యాజమాన్యంతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ స్కూల్ బస్సులను పరిశీలించారు. బస్సులు కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలని, పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించరాదన్నారు. కాలం చెల్లిన బస్సులను విద్యార్థుల రవాణా కోసం వినియోగించరాదని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి బస్సులు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డ్రైవర్లు, క్లీనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సై నరసింహారావు, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

వాహన చట్టం అతిక్రమిస్తే కఠిన చర్యలు



ఆటోలను తనిఖీ చేస్తున్న అధికారులు

మార్కాపురం టౌన్: ఆటో డ్రైవర్లు వాహనాల చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు, ఒంగోలు ఎంవీఐ హెచ్చరించారు. శుక్రవారం మార్కాపురం సమీపంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆటోలను తనిఖీ చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటోవాలాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మొత్తం 18 ఆటోలను తనిఖీ చేసి నిబంధనలు అతిక్రమించిన వారికి 1.49 లక్షల రూపాయలు జరిమానా విధించారు. 4 ఆటోలను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అంకమ్మతల్లి కొలుపులు



ప్రత్యేక అలంకరణలో అంకమ్మతల్లి



జమ్మి ఉత్సవంలో భక్తులు

కొనకనమిట్ల: మండలంలోని సిద్ధవరం గ్రామంలో శుక్రవారం సాయంత్రం అంకమ్మతల్లి అమ్మవారి కొలుపుల ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవం సందర్భంగా అంకమ్మతల్లికి భిక్ష, సముద్రస్నానంతో పాటు జమ్మిచెట్టు దగ్గర పూజలు నిర్వహించారు. రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి కలశ ఉత్సవంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని నైవేద్యాలు సమర్పించారు. శనివారం జల్ది ఉత్సవం, ఆదివారం భక్తులకు అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు, మాజీ సర్పంచ్ యలమందల శ్రీను తెలిపారు.